# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని తెలిపిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు.**

2. **భారత స్వాతంత్ర్య పోరాటంలో జర్నలిజం కీలకపాత్ర పోషించిందన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.**

3. **గోదావరి జిల్లాలో ముంపు సమస్యను అధిగమించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

4. **రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తొలిసారిగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపిన వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్.**

5. **రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఎక్కడైనా రేషన్‌ను తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**

===========================

అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. తిరుపతిజిల్లా నాయుడుపేటలోని బిరుదవాడలో 2 వేల 64 టిడ్కో గృహాలను ముఖ్యమంత్రి ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులతో స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 50 వేల 893మంది నిరుపేదలకు టిడ్కో పథకం కింద గృహాలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 2017వ సంవత్సరంలో టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టామని..అయితే ఇళ్ళ నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. అన్ని వసతులతో టిడ్కో గృహాల నిర్మాణం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

భారత స్వాతంత్ర్య పోరాటంలో జర్నలిజం కీలకపాత్ర పోషించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 11వ జాతీయ ప్లీనరీ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభం అని తెలిపారు. పాఠకులు, ప్రేక్షకుల నమ్మకాన్ని మీడియా నిలబెట్టుకోవడం అత్యంత కీలకమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

----------------------------

గోదావరి జిల్లాలో ముంపు సమస్యను అధిగమించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం పెదలంక, కనకాయలంక గ్రామాల్లో 23 కోట్ల 64 లక్షల రూపాయలతో చేపట్టే రెండు వంతెనల పనులకు మంత్రి నిన్న శంకుస్థాపనలు చేశారు. సమగ్ర నివేదిక తయారు చేసి గోదావరి డెల్టాను పూర్తిగా ఆధునీకరిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేస్తూ..

వాయిస్..27 సెకన్లు

----------------------------

జాతీయ గణాంకాల కార్యాలయం దేశవ్యాప్తంగా క్రియాశీలక సహకార సంఘాలపై ర్యాపిడ్ సర్వేను 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిర్వహించనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ తెలిపారు. సుమారు 21 వేల సంఘాల ఆర్థిక, కార్యాచరణ, ఉపాధి వివరాలు సేకరించనున్నట్లు వివరించారు. ఈ డేటా ఆధారంగా సమగ్ర డేటాబేస్ రూపొందించి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి ప్రణాళికలు, విధాన రూపకల్పనకు ఉపయోగించనున్నట్లు డైరెక్టర్ జనరల్ డి. సతీష్ పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

----------------------------

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, ట్యూటర్ల పోస్టుల భర్తీకి తొలిసారిగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన నిన్న ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టులకు ఎంపికైన వారికి అత్యంత పారదర్శక విధానంలో పోస్టింగ్ ఉత్తర్వులను ఆన్లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఇవ్వబోతున్నట్లు చెప్పారు. మొత్తం 611 పోస్టుల భర్తీకి ఈ ఉదయం 11 నుంచి రేపు సాయంత్రం 6 గంటల మధ్య ఐచ్ఛికాలు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.

----------------------------

త్వరలో గ్రామీణ ప్రాంత ప్రజలకు చౌకధరల దుకాణాల ద్వారా గోధుమ పిండిని అందజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఎక్కడైనా రేషన్ ను తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు.

---------------------------

భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన పలువురు మావోయిస్టులు  పోలీసుల ఎదుట ఈరోజు విజయవాడలో లొంగిపోయారు. సుమారు 36 సంవత్సరాలు పాటు వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ మావోయిస్టు నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి అయిన చెల్లూరి నారాయణ రావుతో పాటు మరో 8 మంది సభ్యులు ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా సమక్షంలో లొంగిపోయారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆ వివరాలను తెలియజేస్తూ..

వాయిస్..27 సెకన్లు

---------------------------

తూర్పుగోదావరి జిల్లా, తాడిమళ్ల గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత రాజగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు నిన్న అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... మానసిక ప్రశాంతతకు, క్రమశిక్షణతో కూడిన జీవనానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవర్చుకోవాలని సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తాను ప్రార్థించినట్లు తెలిపారు.

---------------------------

ఉత్తర ఒడిశాపై ఉపరితల ఆవర్తనము కొనసాగుతోంది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, అంతర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉన్నదని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనము విస్తరించి ఉన్నదని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

వాయిస్..20 సెకన్లు

---------------------------

లండన్ కేంద్రంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప భారతీయ విప్లవ వీరులు, న్యాయవాది, పాత్రికేయులు శ్యామ్‌జీ కృష్ణ వర్మ వర్ధంతి ఈరోజు. గుజరాత్ రాష్ట్రంలోని కచ్‌లో  1857 అక్టోబరు 4వ తేదీన ఆయన జన్మించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు. లండన్‌లో ఇండియన్ హోమ్ రూల్ సొసైటీని 1905వ సంవత్సరంలో స్థాపించి, విప్లవకారులకు ఇండియా హౌస్ ద్వారా ఆశ్రయాన్ని కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చాకే తన అస్థికలను స్వదేశానికి తీసుకువెళ్లాలనే కోరికతో, 1930 మార్చి 30వ తేదీన జెనీవాలో ఆయన తుది శ్వాస విడిచారు.

=====================